

ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పరస్కరించుకొని మంగళవారం మదనపల్లి మండలం, బసినికొండ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎసిడిపిఒ డాక్టర్ ఎం.సునీత, డిటిఎం సునీల్ ఆధ్వర్యంలో చిన్న వయస్సులో పెళ్లిళ్లు జరగడం, ఆ పెళ్లిళ్ల వల్ల జరిగే అనర్థాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, లింగ వివక్షతలపై అవగాహన కల్పించారు. అనంతరం 8, 9, 10వ తరగతి పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వపు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి రంజిత్, రెండవ బాహుమతి శిరీష, మూడవ బహుమతి కీర్తన గెలుచుకున్నారు. వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థి దశ నుంచే విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వక్తలు పేర్కొన్నారు. కార్యక్రమంలో బసినికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, ఎసిడిపిఒ డాక్టర్ ఎం.సునీత, సూపర్వైజర్ కళావతమ్మ, సచివాలయ మహిళా పోలీస్ కె.రాణి, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

విధినిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేవమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీసు పెరేడ్ మైదానంలో మంత్రి సాయుధ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అమరులైన పోలీసు వీరులకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ ఘనంగా నివాళులను అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పది మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి తమ ప్రాణాలు అర్పించారని చెప్పారు. వారి ధైర్యాన్ని, త్యాగాన్ని స్మరించుకోవడానికి, యూనిఫామ్ ధరించి, దేశానికి సేవ చేస్తున్న వారి సేవలను గుర్తించుకోవడానికి అక్టోబర్ 21న పోలీసు సంస్మరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. భారతదేశానికి చైనా, పాకిస్తాన్ తదితర దేశాలతో గల సరిహద్దులలో ప్రమాదం ఎప్పుడు ముంచుకొస్తుందో తెలియని పరిస్థితులు ఉన్నాయని, ఆ సరిహద్దులలో పర్వతశ్రేణులు, మంచు కొండలు వంటి క్లిష్ట పరిస్థితులు ఉంటాయని, అయినప్పటికీ మన జవానులు దేశ రక్షణలో నిరంతరం మునిగి ఉంటారన్నారు. రాష్ట్రంలోని పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణలో, ప్రజల భద్రతకు భరోసా కల్పించడంలో, చట్టాలను పరిరక్షించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో మాత్రమే కాకుండా రాత్రిపూట పెట్రోలింగ్, ట్రాఫిక్‌ను నియంత్రించడం, మెడికల్ ఎమర్జెన్సీలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అంశాలలో ముఖ్య పాత్ర పోషిస్తారన్నారు. వారి కుటుంబాలకు ఎల్లప్పుడూ సహాయ సహకారాన్నిస్తామని తెలిపారు. వారి త్యాగాలను మరచిపోకూడదని, వారి అంకితభావం రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా చూసుకోవాలని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగనిరతికి ప్రతి సంవత్సరము అక్టోబరు 21వ తేదీన పోలీసు అమరవీరుల దినంగా పరిగణిస్తున్నామన్నారు. దేశభద్రత కోసం పగలనక, రేయనక, విధినిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్ళు, అధికారులు విధులను విజయవంతంగా నిర్వహించడంలో భాగంగా వారు తమ ప్రాణ త్యాగాలను, సేవలను సింహావలోకనం చేసుకుంటూ సేవల అర్థాన్ని పరమార్థాన్ని గుర్తిస్తూ కొనియాడుట మనందరి కర్తవ్యమని పేర్కొన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, కరుడుగట్టిన మతోన్మాదం మితి మీరిపోతున్న ప్రస్తుత తరుణంలో పోలీసు వృత్తి ప్రాణాలతో చెలగాటమని తెలిసి కూడా వాటిని లెక్కచేయక ప్రజాసేవలో నిమగ్నం అవుతున్నామని పేర్కొన్నారు. అగ్నిప్రమాదాలు, తుపాన్ (సైక్లోన్)లు సంభవించు సందర్భాలలో పోలీసుల పాత్ర చాలా ఉందన్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్ మహమ్మారి నుంచి ప్రజలను కాపాడే క్రమంలో పోలీసులు ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా ఉన్నారన్నారు. ఈ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో పనిచేస్తున్న పోలీసులను కోరేది ఏమంటే మనమందరం కష్టపడి ప్రజా రక్షణలో నిమగ్నమై ప్రజల యొక్క ఆస్తులను, వారి ప్రాణాలను కాపాడుతూ వారికి అవసరమైనప్పుడు మనము ఉన్నాము అని వారికి భరోసా ఇచ్చినప్పుడే, అమరులైన పోలీసులకు నివాళి అర్పించినట్లు అవుతుందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణాలు కోల్పోయి అమరులైన పోలీసులు అందరికీ జోహార్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, అదనపు ఎస్‌పి ఎం.వెంకటాద్రి, రాజంపేట ఎఎస్‌పి మనోజ్ రామనాథ్ హెగ్డే, మదనపల్లి డిఎస్‌పి ఆర్.కృష్ణమోహన్, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసులు, డిఆర్ఒ మధుసూదన్‌రావు, జిల్లాలోని సిఐలు, ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది, హోమ్ గార్డులు, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎస్‌పి, జెసి

అమ్మో.. మాయలేడి..

- ◆ సంఘమిత్ర ముసుగులో రూ.39 లక్షలు స్వాహా
- ◆ స్త్రీనిధి నిధులు కాజేసిన వైనం
- ◆ బాధితుల ఫిర్యాదుతో వెలుగులోకి..
- ◆ విచారిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్

ఆమె ఓ మాయలేడి, 32 మహిళా సంఘాల గ్రూపులకు ప్రతినిధి. సంఘమిత్ర ముసుగులో 32 గ్రూపుల్లో ఉన్న 320 మంది మహిళలను బురిడీ కొట్టించి, ఎవరికి తెలియకుండా వారి పేరు మీదనే రూ.39 లక్షలు స్త్రీనిధి నిధులు కాజేసి స్వాహా చేసింది. బ్యాంకర్ల నోటీసులతో బెంబేలెత్తిన మహిళలు ఏమి జరిగిందో తెలుసుకోలేక లబోదిబో మంటూ పోలీసుస్టేషన్‌కు పరుగులు పెట్టి తమకు న్యాయం చేయాలని అర్థిస్తున్నారు. ఈ ఉదంతం మంగళవారం మదనపల్లె మండలంలో వెలుగు చూసింది. బాధితులు పోలీసులకిచ్చిన ఫిర్యాదు మేరకు.. మదనపల్లె మండలం, సిటిఎం పంచాయతీ రేగంటివారిపల్లెకు చెందిన సుబ్రహ్మణ్యం భార్య స్వాతి సంఘమిత్రగా విధులు నిర్వహిస్తోంది. ఈమె పరిధిలో 32 గ్రూపులకు చెందిన 320 మంది మహిళలు ఉన్నారు. ఈమె గత కొంతకాలంగా సభ్యులకు తెలియకుండా వారి పేరు మీదనే స్త్రీ నిధి డబ్బులు డ్రా చేసుకుంది. సుమారు రూ.39 లక్షలు సభ్యుల పేరు మీద బ్యాంకులో చెక్కులు వేసి డబ్బులు డ్రా చేసుకొని కాజేసింది. బ్యాంకులకు ఈ మొత్తం రికవరీ కాకపోవడంతో గత కొంతకాలంగా ఈ 32 గ్రూపుల్లోని సభ్యులకు నోటీసులు పంపింది. ఏమి జరిగిందో ఏమో తెలియని సభ్యురాల్లు తెలిసిన వారిని ఆరా తీయగా స్త్రీనిధి నుంచి మీరు ఇంత మొత్తంలో డబ్బులు తీసుకున్నారని, తిరిగి చెల్లించకపోవడంతో నోటీసులు వచ్చాయని వివరంగా చెప్పారు. ఖంగుతిన్న సభ్యులు పరుగు పరుగున పోలీసుస్టేషన్‌కు వెళ్లి పోలీసులను ఆశ్రయించారు. సంఘమిత్ర స్వాతి తమ పేరు మీద స్త్రీనిధి డబ్బులు డ్రా చేసి రూ.39 లక్షలు కాజేసిందని, బ్యాంకర్లు తమకు నోటీసులు పంపారని లబోదిబోమన్నారు. డబ్బు కాజేసిన స్వాతిపై కఠిన చర్యలు తీసుకుని మోసపోయిన తమను ఆదుకోవాలని అభ్యర్థించారు. స్పందించిన తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ సంఘమిత్ర స్వాతిని స్టేషన్‌కు పిలిపించారు. ఏమి జరిగిందని ఆరా తీశారు. వివరాలను సిఐ కళా వెంకటరమణకు నివేదించారు. సిఐ దర్యాప్తు ప్రారంభించారు. బాధ్యతగా పనిచేయాల్సిన సంఘమిత్ర గ్రూపు సభ్యులను బురిడీ కొట్టించి వారి పేరు మీద రూ.39 లక్షలు స్త్రీనిధి డబ్బులు కాజేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు పారదర్శకంగా విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.



సంఘమిత్ర స్వాతిని విచారిస్తున్న ఎస్ఐ చంద్రమోహన్



పోలీసుస్టేషన్‌కు వచ్చిన బాధిత మహిళలు



మాట్లాడుతున్న డిఇఒ సుబ్రమణ్యం

23న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

- జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

పోలీస్ అమర వీరుల స్మారక వారోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం డైట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను అర్పించిన ధీర పోలీస్ అమర వీరులను స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ నెల 21 నుండి 31 వరకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లా విద్యాశాఖ వారికి సహకరిస్తూ జిల్లాలోని అన్ని యాజమాన్యాలలోని 8 నుండి 12వ తరగతి వరకు గల విద్యార్థులలో దేశభక్తి, సామాజిక బాధ్యత, చట్టపరమైన అవగాహనను పెంపొందించడానికి 'లైంగిక దాడుల నుంచి మహిళలు, బాలల రక్షణలో విద్యార్థుల పాత్ర' అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నామని చెప్పారు. పోటీలు డైట్, రాయచోటి, జడ్‌పి హైస్కూల్, మదనపల్లి, జడ్‌పి హైస్కూల్ మన్నూరు, రాజంపేటలో ఈనెల 23న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఇందులో డివిజన్ వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన వారికి జిల్లాస్థాయిలో పోటీలను ఈనెల 26న జిల్లా ఎస్‌పి కార్యాలయంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కార్యక్రమాలలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ప్రజాశక్తి - రాయచోటి

అన్నమయ్య జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08561-293006) ఏర్పాటు చేసినట్టుగా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్ ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

రామిరెడ్డి కళాశాలలో ఇండియన్ ఐడల్ పోటీలు

ప్రజాశక్తి - కడప

స్థానిక ఊటుకూరు ప్రకృతి నగర్‌లోని రామిరెడ్డి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో దేశంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఇండియన్ తెలుగు ఐడల్ పోటీలు మంగళవారం ఘనంగా నిర్వహించారు, ఆహా టీవీ శ్రేయాస్ మీడియా సహకారంతో పాటల పోటీలు నిర్వహించి నలుగురిని ఎంపిక చేశారు. కార్యక్రమంలో అతిథులు పిఆర్ఆర్ఎం కళాశాల కరెస్పాండెంట్ పి. గౌతమ్ కుమార్ రెడ్డి, గీతరెడ్డి పాల్గొని గాయకులు పవన్ కల్యాణ్, సృష్టి , బృంద, ధీరజ్‌ను ఘనంగా సత్కరించారు. నలుగురు గాయకులు పోటాపోటీగా పాడరని, వీరికి మంచి భవిష్యత్తు ఉందని ప్రిన్సిపల్ నెల్సన్ కుమార్, యుగంధర్, గ్లోరి కొనియాడారు. కార్యక్రమంలో వంద పాటలు వరకు పాడి విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులు ఉత్సాహంగా కరతాళ ధ్వనుల మధ్య వర్షంలోనూ డాన్సులు ఆడి పాడి సంతోషించారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సాయికుమార్

ప్రజాశక్తి-రాజంపేట

రాజంపేట అన్నమయ్య ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జ్యోతి సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతవారం నామినేషన్ల ప్రక్రియ జరగగా అధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ చేశారు. మంగళవారం రాజంపేట అన్నమయ్య ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్నికల్లో పోటీల్లో పాల్గొన్న అభ్యర్థులు ఎన్నికలకు సిద్ధం కాగా కొన్ని అనివార్య కారణాల వలన ఒక అభ్యర్థి తప్పుకోవడంతో రెండో అభ్యర్థి జ్యోతి సాయికుమార్‌ను సీనియర్ ఫొటో గ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు జ్యోతి ఎన్నిక చేశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను ఏకగ్రీవంగా ఎన్నిక చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఫొటోగ్రఫీ సంక్షేమానికి తమ వంతు శాయశక్తుల కృషి చేస్తానని పేర్కొన్నారు. ఏ ఒక్కరికి సమస్య వచ్చినా తాను ముందుండి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ పెద్దలు శ్రీనివాసులు రాజు, నాగేంద్ర, రామ్స్, శ్రీనువాసులు, నిస్సార్, నాగేంద్ర, రఘు వర్మ, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

వైవీయూను మేటిగా నిలపడమే లక్ష్యం

- ◆ డిసెంబర్ 31లోపు కాన్వకేషన్ నిర్వహిస్తాం
- ◆ వైవీయూ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

సరికొత్త ప్రణాళికలతో యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని దేశంలో మేటి యూనివర్సిటీగా, విద్యార్థులను అత్యున్నత మానవ వనరుగా తయారు చేసే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని యోగి వేమ విశ్వవిద్యాలయ విసి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. మంగళవారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాణ్యమైన బోధన, పరిశోధన, ఉద్యోగ నైపుణ్యాలు ప్రాధాన్యత అంశాలుగా తీసుకున్నామని చెప్పారు. గతంలో తాను పనిచేసిన విశ్వవిద్యాలయం బెస్ట్ ప్రాక్టీసెస్ ఇక్కడ అమలు చేస్తామన్నారు. ఈ మూడేళ్లలో వరల్డ్ క్లాస్ యూనివర్సిటీగా తయారు కావడానికి వ్యూహాలు రచిస్తున్నామన్నారు. మా విశ్వవిద్యాలయంలో 98 మంది రెగ్యులర్ ఫ్యాకల్టీ ఉన్నారని అంతర్జాతీయ స్థాయిలో పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్‌లు కలిగి ఉండటం, 1700 పరిశోధన పత్రాలు స్కోప్, వెబ్సోర్ట్ వంటి ప్రామాణిక జర్నల్స్ లో పబ్లిష్ అవడం విశ్వవిద్యాలయ ప్రగతికి నిదర్శనమని చెప్పారు. భవిష్యత్తులో వీరు నిర్వహించే క్రియాశీలక పాత్రతో విశ్వవిద్యాలయం నంబర్ వన్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2031 నాటికి సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించబోతున్నామని చెప్పారు. 2027 వ సంవత్సరంలో నేషనల్ అసెస్మెంట్ అక్రిడేషన్ కౌన్సిల్ (ఎన్ఎఎసి)ఎ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించాలనే లక్ష్యంతో మేమంతా ఉన్నామన్నారు. రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో ఒకటి నుంచి 20 లోపు ర్యాంకుల్లో నిలిచేలా గట్టి ప్రయత్నం చేస్తామన్నారు. దూరవిద్యలో ఆన్‌లైన్ ఎడ్యుకేషన్‌ను ప్రారంభించనున్నామని, కొత్త కోర్సులను ప్రవేశపెట్టడానికి స్టాండింగ్ కౌన్సిల్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌తో కలిసి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్ కృతజ్ఞ్యానాన్ని అందరి విద్యార్థులకు అందేలా చూస్తామన్నారు. ప్రతి డిగ్రీ కళాశాలలో కెరీర్ కౌనె9్సలింగ్ సెల్లు ఏర్పాటు చేసి ఇన్‌ఛార్జులను నియమిస్తామని తెలిపారు. ఆలోచనలను విద్యార్థుల అవసరాలను, అసౌకర్యాలను ఎప్పటికప్పుడూ తెలుసుకునేందుకు సజెషన్ బాక్స్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. పద్మా మాట్లాడుతూ విసి సారథ్యంలో విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రంథాలయ సమయ వేళలను పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిని వివరించారు. ఐక్యు ఎసి డైరెక్టర్ డాక్టర్ ఎల్ సుబ్రహ్మణ్యం శర్మ మాట్లాడుతూ అనేక విద్యాసంస్థల్లో ప్రస్తుత విసి పనిచేసిన దృష్ట్యా ఆయన అనుభవం విశ్వవిద్యాలయ ప్రగతికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. డైలీ మానిటరింగ్ మెకానిజం ను అభివృద్ధి చేస్తున్నారని, యుద్ధ ప్రాతిపదికన విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందుతుం దన్నారు. ప్రజా సంబంధాల సంచాలకులు డాక్టర్ పి.సరిత విశ్వవిద్యాలయ అభివృద్ధికి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ఎలక్ట్రానిక్ మీడియా చేస్తున్న కృషిని కొనియాడారు. సమావేశంలో వైవీయూ అడిషనల్ పబ్లిక్ రిలేషన్ సెల్ ఆఫీసర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ టి.సురేష్ బాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీయూ విసి ఆచార్య రాజశేఖర్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి : ఎంపీ



మాట్లాడుతున్న ఎంపీ సిఎం రమేష్

ప్రజాశక్తి-రాజంపేట

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని అనకాపల్లి ఎంపీ సిఎం రమేష్ అన్నారు. పట్టణ పరిధిలోని సరస్వతి విద్యా మందిరంలో ఆయన గతంలో విడుదల చేసిన రూ.20 లక్షల నిధులతో ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని మంగళవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం సంక్షేమం తోపాటు అభివృద్ధి వైపు పయనిస్తుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలో డేటా కంపెనీ ఏర్పాటుతో ప్రత్యక్షంగాను, పరోక్షంగాను లక్షలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సహకారంతో, చంద్రబాబు అనుభవం, పవన్ కల్యాణ్ ప్రోత్సాహంతో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు పెడుతుంటే వైసిపి వారు చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారని, ఇది వారికి ఏమాత్రం తగదని దుయ్యబట్టారు. స్థానిక సరస్వతి విద్యా మందిరం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని, పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, బిజెపి జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, టిడిపి సీనియర్ నాయకులు ఎద్దుల సుబ్బరాయుడు, సరస్వతీ విద్యా మందిరం అధ్యక్షులు డాక్టర్ సుధాకర్, కాకర్ల రాముడు పాల్గొన్నారు. అంతకుమునుపు టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ ఇంటికి వెళ్లి అల్పాహారం విందు స్వీకరించి తదనంతరం టిడిపి నాయకుడు కావుటూరు సుబ్రహ్మణ్యం నాయుడు స్వగృహంలో ఆతిథ్యం స్వీకరించారు.

'వైద్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం రీజినల్ డైరెక్టర్ వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట వైద్య ఆరోగ్య శాఖలో ఉన్న వివిధ సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖలో గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన జిఒ 143 వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులను మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేస్తూ దాదాపు మూడు వేల పర్యవేక్షక ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఉందని తెలిపారు. జీతం ఒక్కచోట పని ఒకచోట చేస్తూ ఉద్యోగులు ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. ఎఎన్ఎంలకు జిఎన్ఎంలుగా శిక్షణ ఇచ్చి రెండు సంవత్సరంల అయినప్పటికీ వారికి ఎటువంటి ఉద్యోగోన్నతి కల్పించలేదని పేర్కొన్నారు. జిఒలోని అవకతవకలు కట్టడి చేయాలని, ఆర్‌డి కార్యాలయంలో ఉద్యోగోన్నతుల కోసం అన్ని కేడర్లకు సంబంధించిన సీనియారిటీ లిస్టును త్వరితగతిన విడుదల చేయాలని, వాటిలో ఉన్నటువంటి తప్పులను సరిచేయాలని కోరారు. ఎఎన్ఎంలకు మహిళ సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పెండ్లికట్ల మల్లయ్య, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, అసోసియేషన్ కార్యదర్శి ఖాదర్ బాషా, రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, భాస్కర్ యాదవ్, అనంతపురం, కర్నూలు జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు మక్బూల్ బాషా, జిల్లా మహిళా విభాగపు నాయకులు అచ్చమ్మ పాల్గొన్నారు. ధర్నా తదనంతరం రీజినల్ డైరెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. సమస్యలపై స్పందించిన డైరెక్టర్ తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తూ ఉన్నత అధికారులపరిధిలో ఉన్న వాటిని వారి దృష్టికి తీసుకువెళతానని హామీ ఇచ్చారు.



బాధితులకు చెక్కు అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పేదలకు వరం సిఎం సహాయనిధి : మంత్రి

ప్రజాశక్తి-రాయచోటి

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిదని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి 55 మంది అనారోగ్య బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.40.46 లక్షల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రాయచోటి నియోజకవర్గంలోనే ఇప్పటివరకు రూ.6.22 కోట్లను సిఎం రిలీఫ్ ఫండ్ సహాయాన్ని పంపిణీ చేయడం తనకు గర్వకారణమని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని మంత్రి వ్యక్తిగతంగా తెలుసుకున్నారు. పేదల వైద్య అవసరాల్లో ఎప్పుడూ అండగా ఉంటామని, ఆరోగ్య సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడమే ప్రధాన లక్ష్యమని రవాణా, యువజన క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో రాంప్రసాద్‌రెడ్డి ప్రజల సమస్యలు, అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో, జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు ఉండాలని మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అధికారుల అప్రమత్తంగా ఉండి జిల్లాలో ఎక్కడ అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బహుభాషావేత్త 'జానమద్ది'

- వైవీయూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ

ప్రజాశక్తి- కడప అర్బన్: 'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ పేరిట స్మారక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి, అనేక కార్యక్రమాలు నిర్వహించి, సాహితీ పరిమళాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి అని యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథా లయ వ్యవస్థాపకులు డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి 101వ జయంతి నిర్వ హించారు. కార్యక్రమంలో ముందుగా ఇన్‌ఛార్జి విసి, సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి, పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, పరిశోధన కేంద్రం సిబ్బంది కలసి పరిశోధన కేంద్రం ప్రాంగణంలోని డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి కాంస్యవిగ్రహానికి, సమావేశ మందిరంలోని జానమద్ది చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పిం చారు. ఆ తర్వాత ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ కడప నగరంలో సి.పి. బ్రౌన్ సాహిత్యయజ్ఞం జరిపిన ప్రదేశంలో మొట్టమొదటగా బ్రౌన్ స్మారక భవనాన్ని నిర్మించడం విశేషమన్నారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలకు అనుగుణంగా విశ్వవిద్యాలయం తోడ్పాటుతో పలు నూతన కార్యక్రమాలను చేపట్టి గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పడతామన్నారు. హనుమచ్ఛాస్త్రి ఎందరో సాహితీవేత్తల నుండి అరుదైన అనేక గ్రంథాలు సేకరించి, బ్రౌన్ గ్రంథాలయాన్ని ఒక గొప్ప విజ్ఞాన కేం ద్రంగా తీర్చిదిద్దారన్నారు. గ్రంథాలయ నిర్మాణానికి స్థలాన్ని ఇచ్చిన సి.ఆర్.కృష్ణస్వామి, సి.కె.సంపత్ కుమార్ ఔదార్యాన్ని తప్పక స్మరించుకోవాలని చెప్పారు. జానమద్ది ఉపాధ్యాయుడుగా రాయదుర్గం సమీపంలోని కన్నడ ప్రాంతంలో పనిచేస్తున్నప్పుడు, వయోజన విద్యా డైరెక్టరుగా ఉన్న ప్రముఖ గ్రంథాలయోద్యమ నాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు అక్కడి ప్రజలను చైతన్యపరచడానికి వచ్చారని, ఆయన తెలుగులో చెప్పిన ప్రసంగాలను శాస్త్రి కన్నడంలోకి అనువదించారని, ఆ సందర్భంలో శాస్త్రి ఆయనచే చాలా ప్రభావితమయ్యారని, ఆ కారణంగానే ఆ తర్వాత ఆయన సి.పి.బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణాన్ని చేపట్టారని తెలిపారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రి బహుభాషావేత్త అని, ఆయనకు తెలుగుతో పాటు కన్నడం, సంస్కృతం, ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం ఉండడం వల్లనే ఆయన పలురకాల రచనలు చేయగలిగారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధనకేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్ మాట్లాడుతూ బ్రౌన్ గ్రంథాలయ నిర్మాణం కోసం తన తండ్రి అహర్నిశలు శ్రమించారన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపా లకృష్ణ శాస్త్రి, డాక్టర్ శివారెడ్డి, గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక పాల్గొన్నారు.


అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న జగన్‌మోహన్‌రాజు

ఘనంగా 'చమర్తి' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-రాజంపేట

తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు 54వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆర్ అండ్ బి అతిథి గృహంలో 54కిలోల కేకు కోసి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డుల్లోనూ వార్డు అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు కేకు కోసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జగన్ రాజు సారథ్యంలో రాజంపేట నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడవాలని, ఆయన నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవించి, మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

జ్వరంతో మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

జ్వరం బారిన పడిన ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో వెలుగు చూసింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పట్టణంలోని కమ్మవీధికి చెందిన శ్రీనివాసులు భార్య ఉమాదేవి (54) గత మూడు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స అందించిన నయం కాలేదు. మంగళవారం స్థానిక జిల్లస ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు.

బహుదా పరివాహక ప్రాంతాలకు వెళ్లొద్దు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని ముష్టూరులో గ్రామంలో ఉన్న బహుదా ప్రాజెక్టు, బహుదానది పరివాహక ప్రాంతాలకు ప్రజలు ఎవరు వెళ్ళవద్దని తహశీల్దార్ తపస్విని హెచ్చరించారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బహుదా ప్రాజెక్టులో నీటిమట్టం పెరిగిందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుకు వచ్చే వరద నీరు పెరగడంతో బహుదా ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుతోందన్నారు. మరోవైపు రానున్న మూడు రోజులు విస్తారంగా వర్షాలు పడనున్నట్లు వాతావరణ శాఖ తెలుపుతున్నాదని, తద్వారా వరదలు సంభవించే అవకాశం ఉందన్నారు. బహుదా ప్రాజెక్టుకు సందర్శకులు, విద్యార్థులు, ప్రజలు ఎవరు వెళ్ళవద్దని, ప్రమాదాల బారిన పడవద్దని తెలిపారు. బహుదా ప్రాజెక్టు సందర్శనకు ప్రస్తుతం అనుమతులు లేవన్నారు. వాతావరణ హెచ్చరికలతో సంబంధించిన విఆర్‌ఒలను, పోలీస్ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మండలంలో నిండుతున్న చెరువులపై విఆర్‌ఒలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను నదీ పరివాహక ప్రాంతాలకు, నిండిన చెరువుల వద్దకు, బహుదా నదిలోకి సరదాల కోసం, ఈత కోసం, చేపల వేట కోసం వెళ్ళవద్దని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులను పాఠశాల సమయంలో వరదల వద్దకు, నిండిన చెరువుల వద్దకు వెళ్ళకుండా గమనించాలని సూచించారు. పోలీసులు కూడా ఇదివరకే ప్రమాదక హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు సూచించారు. నీటి ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, మూడు రోజులపాటు విస్తారంగా వర్షాలు పడనున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. **మదనపల్లె అర్బన్ :** ఈనెల 21 నుంచి 24 తేదీ వరకు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మదనపల్లె సబ్ కలెక్టర్ చల్లా కల్యాణి ఓ ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ఏదైనా అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే సబ్ కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామన్నారు. అత్యవసర పరిస్థితులు, క్లిష్ట పరిస్థితులు ఏర్పడితే కంట్రోల్ రూమ్ నెంబర్ 08571 231181 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. తద్వారా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి పరిస్థితులు చక్కబెట్టడం జరుగుతుందని తెలిపారు. **రాజంపేట:** చెయ్యేరు నది పరివాహక ప్రాంత ప్రజలు, పశువులు, గొర్రెల కాపరులు, మత్స్యకారులు నదీ తీరం దగ్గరకు వెళ్ళకూడదని, నది దాటే ప్రయత్నం చేయకూడదని రాజంపేట తహశీల్దార్ పీర్‌మున్ని ఒక ప్రకటనలో హెచ్చరించారు. లోతట్టు ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. **సుండుపల్లె :** మండల పరిధిలోని పింఛా ప్రాజెక్టుకు పరిధిలోని తోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాలైన పీలేరు, నిమ్మన పల్లి నుంచి వర్షపు నీరు పింఛా ప్రాజెక్టుకు వచ్చి చేరుతుం డటం తోఅధి. కారులు రెండు గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారని తెలిపారు. దిగువ ప్రాంతంలో నివ సించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెయ్యేరు నది పరివాహక ప్రాంతంలో నివసించే ప్రజలు అప్ర మత్తంగా ఉండి నదులు, వాగులు దాటకూడదని ముఖ్యంగా ఈతకు వెళ్లవద్దని, రైతు లు తమ పశువులను మేతకు నది ఇరువైపుల తీసుకెళ్లరాదని సూచించారు. పిల్లలను కూడా జాగ్రత్తగా ఇళ్లలోనే ఉంచుకోవాలని తెలిపారు.

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు యుటిఐ ఈక్విటీ ఫండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

చిన్నారుల ఉన్నత విద్యకు, వివాహాది శుభకార్యాల కోసం యుటిఐలో ఉన్న చిల్డ్రన్స్ ఈక్విటీ ఫండ్ మంచి పథకమని యుటిఐ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్ ఎ.వి.ఎస్.చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం నగరంలోని గుంత బజార్‌లో ఉన్న యుటిఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవన ప్రయాణంలో తమ పిల్లలు అనేక బహుమతులను గెలుచుకోవాలని, ఉన్నత చదువులను అభ్యసించాలని, ఉన్నత పదవులను అధిరోహించాలని ప్రతి తల్లిదండ్రులు కోరుకుంటారని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని అత్యుత్తమ స్థాయిలో ఉంచాలని, డాక్టర్, ఇంజినీర్, పైలెట్, సైంటిస్ట్, లాయర్, సిఎ, బిజినెస్ ఇలా అనేక రంగాల్లో నైపుణ్యాన్ని సాధించి దేశ ఆర్థిక పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని చెప్పారు. అలాంటివారు తమ పిల్లల కోసం యుటిఐ ఈక్విటీ ఫండ్ పథకంలో మదుపు చేయాలని సూచించారు. ఇందులో పెట్టుబడులు పెట్టినవారు మంచి ఫలితాలను చూసి సంతృప్తి చెందారన్నారు. ఒకేసారి పెట్టుబడి పెట్టలేని వారికి ప్రతి నెలా పెట్టుబడి పెట్టే అవకాశం ఉందన్నారు. చిన్న పిల్లలకే కాకుండా పెద్దవారికి కూడా మంచి పథకాలు ఉన్నాయని వివరించారు. మూడు నెలలకు పింఛన్ పొందుటకు వీలుగా ఒకేసారి పెట్టుబడి పెట్టే విధానం కూడా ఉందన్నారు. నిజాయితీగా సంపదను అభివృద్ధి చేసి, తల ఎత్తుకుని జీవింప చేయడమే యుటిఐ లక్ష్యమన్నారు. పాన్, ఆధార్, ఫొటో, చెక్కుతో తమ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. తప్పనిసరిగా పథకాల ఆర్ఒఎం, ఒడి చదవాలని సూచించారు. ఆసక్తి ఉన్న పెట్టుబడిదారులు పూర్తి వివరాలకు నగరంలోని తిరుమల హాస్పిటల్ సమీపంలో గుంత బజార్‌లో ఉన్న యుటిఐ మ్యూచువల్ ఫండ్స్ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

డేటా ప్రాధాన్యత తెలుసుకోవాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

దైనందిన జీవితంలో ప్రతిదీ డేటాతోనే ముడిపడి ఉందని, దాని ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని యోగివేమన యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. నాల్గవ వరల్డ్ స్టాటిస్టికల్ డే సందర్భంగా మంగళవారం యోగివేమన యూనివర్సిటీ విసి కీలకోపన్యాసం చేశారు. గణాంకాలు సమాజానికి అద్దంలా పనిచేస్తాయని, సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఊతంగా నిలుస్తాయని తెలిపారు. డేటా ప్రాధాన్యత, ఎలా ఉపయోగించాలి, ఎలా సద్వినియోగం చేసుకోవాలి, దాని మూల్యాంకనాన్ని చేసే విధానం, పరిరక్షణ సంబంధించి ఉదాహరణలతో అవగాహన కల్పించారు. రీసెర్చ్ స్కాలర్‌లు వారి పరిశోధనలలో స్టాటిస్టికల్ టూల్స్ ఉపయోగించడం వల్ల గణనలు సులభతరం చేయవచ్చన్నారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ స్టాటిస్టిక్స్ సంబంధించిన టూల్స్‌ను క్షుణ్ణంగా నేర్చుకుని వాటికి సంబంధించిన సర్టిఫికెట్ కోర్సులను చేస్తే మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందుతారని తెలిపారు. తనే స్వయంగా క్లాసులు తీసుకుని మరింత లోతైన అవగాహనను కల్పిస్తానని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాస్, ఎఐఎస్ హెచ్చు నోడల్ ఆఫీసర్ ఆచార్య కాత్యాయిని సమావేశాన్ని సమన్వయం చేశారు. కార్యక్రమంలో టీచింగ్ అసిస్టెంట్ డాక్టర్ హరినాథ్, యూనివర్సిటీ అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షంతో మొక్కజొన్న రైతుకు కష్టాలు

ప్రజాశక్తి - చాపాడు


మైదుకూరు బైపాస్‌లో వర్షం నుంచి మొక్కజొన్నను కాపాడుకునేందుకు పట్టలు కప్పిన రైతులు

తుఫాన్ ప్రభావంతో మైదుకూరు నియోజకవర్గ వ్యాప్తంగా మొక్కజొన్న రైతులు కుదేలవుతుఆన్నరు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మొక్క జొన్న ప్రస్తుతం రైతులు నూర్పిడి చేసి ఆరబెడుతున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా ఆగకుండా వర్షం పడుతోంది. వర్షాన్నుంచి మొక్కజొన్న విత్త నాలను కాపాడుకునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారుల వెంబడి రోడ్లపై మొక్కజొన్న విత్తనాలను కుప్పలుగా పోసి ప్లాస్టిక్ పట్టలతో వర్షానికి తడవకుండా జాగ్రత్త పడుతున్నారు. సోమవారం కొంతసేపు మాత్రమే వర్షం పడి ఆగింది. మంగళవారం మాత్రం అధికంగా వర్షం పడడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగు చేపట్టిన రైతులు వర్షానికి విత్తనాలు దెబ్బ తిం టాయని దిగాలు చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట మాత్రం వర్షం వల్ల ఎలాంటి నష్టం ఉండదని పేర్కొంటున్నారు. ముం దస్తుగా వరి పంట సాగు చేసి నూర్పిడి చేపడుతున్న రైతులు మాత్రం ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. చాపాడు మండల పరిధిలోని అయ్యవారిపల్లె, రామదాసుపురం, తిమ్మాయపల్లి గ్రామాల వద్ద వరి పంట నూర్పిడి పనులు చేపట్టారు. ఆగకుండా పడుతున్న వర్షానికి గ్రామా ల్లో రోడ్లన్నీ బురదమయ మయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచి ఇబ్బందికరంగా తయారైంది. వర్షం రెండుమూడు రోజులపాటు ఆగ కుండా పడితే తీవ్ర నష్టం వాటి ల్లుతుందని రైతుల్లో ఆందోళన నెలకొంది. ఉల్లి రైతుల పరిస్థితి కూడా అగ మ్యగోచరంగా తయారైంది. ధరలు లేక పోవడంతో రైతులు చాలావరకు నూ ర్పిడి చేయకుండా ఉల్లిగడ్డలను అలానే పొలంలో ఉంచారు. ప్రస్తుత వర్షానికి ఉల్లిగడ్డలు కుళ్లి దెబ్బ తింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల సేవలు అజరామరం



నిమ్మనపల్లి : పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్ఐ తిప్పేస్వామి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

విధి నిర్వహణలో ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసుల త్యాగాలు మరువలేనివని స్థానిక ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. మంగళవారం నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ లో ట్రైనీ ఎస్ఐ శ్రీప్రియ, పోలీసు సిబ్బందితో కలిసి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఆయన నిర్వహించారు. కర్తవ్య నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరులకు నివాళు లర్పించారు. కొంత సమయం మౌనం పాటించి అమరవీరులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కర్తవ్యం నిర్వహణలో పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించి అమరులైన పోలీసుల వీరత్వాన్ని, డ్యూటీ పట్ల విధేయతను, ధైర్యాన్ని స్మరించుకుంటూ అక్టోబర్ 21న పోలీస్ అమరుల సంస్మరణ దినోత్సవం జరుపుకుంటూ వస్తున్నామన్నారు. ప్రజా భద్రత ప్రామాణికంగా పెట్టుకొని తమ కుటుంబాలను సైతం పోలీసులు పక్కన పెట్టడం జరిగిందన్నారు. కరోనా సమ యంలో పోలీసులు నిర్వర్తించిన విధులను గుర్తు చేశారు. పోలీసులంటే ప్రజలకు ఒక భరోసా, ధైర్యం, అభిమానం చూపిస్తూనే, అసాంఘిక శక్తులపై తమ వీరత్వాన్ని చాటి చెప్పడం జరుగుతున్నాదన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జిలానీ భాష, హెడ్ కానిస్టే బుల్ రమణ, రామ్మూర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **నందలూరు :** ప్రజాస్వామ్య, సమాజ పరిరక్షణ కొరకు నిరంతరం పోరాడి ప్రాణాలు కోల్పోయిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్లో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి పోలీసులు ప్రగాఢ నివాళులు సమర్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ లక్ష్మీ దేవి, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి-రామాపురం

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న టిడిపి నాయకులను మంగళవారం రాష్ట్ర రవాణా, క్రీడా,యువజనశాఖ మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్న సరస్వతిపల్లి సర్పంచ్ షేక్‌మునీర్ బాషాను ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మండల టిడిపి నాయకుడు భవనం వెంకటరామిరెడ్డి కుమారుడు రమేష్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయ పడిను విషయం తెలుసుకొని చిట్లూరు పంచాయతీ కొండవాండ్లపల్లి వెళ్లి పరా మర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు అధైర్య పడ వద్దని ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కుప్పం నియో జకవర్గం పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్‌రెడ్డి, సరస్వతి పల్లి సింగల్ విండో అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి, కొలిమివాళ్ళపల్లి సింగల్ విండో డైరెక్టర్ సహదేవరెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి జిల్లా మానిటరింగ్ కమిటీ సభ్యుడు వెంకటరమణ, పాలఎకరి చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, లక్కిరెడ్డిపల్లి మండల టిడిపి ఇన్‌ఛార్జి విశ్వనాథ్ ఎంఎల్ వెంకటరామిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సర్పంచ్ షేక్‌మునీర్‌ను పరామర్శిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విద్యార్థులు శాస్త్రీయంగా ఆలోచించాలి

- డాక్టర్ బైరి నరేష్


బైరి నరేష్‌ను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల కేంద్రంలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌ను భాగంగా డాక్టర్ బైరి నరేష్ సందర్శించారు. గత వారం రోజులుగా రాయలసీమలోని ఎనిమిది జిల్లాలలో ఆయన పర్యటిస్తూ మంగళవారం శ్రీప్రత్యూష హైస్కూల్ ఉపాధ్యాయులు, విదా ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని, మూఢనమ్మకాలను విడిచి పెట్టాలని కోరారు. సమాజ అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకమని విజ్ఞానంతోనే వాటిని అంతం చేయాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సైకాలజీ మేలు కువలను వివరించారు. కార్యక్రమంలో మూఢనమ్మకాల నిర్మూలన సంఘం వ్యవస్థాపకురాలు జాతీయ సమన్వయకర్త గాండ్ల సుజాత, సంఘం నాయకురాలు దమ్ము పద్మమ్మ, యూత్ ప్రెసిడెంట్ అచ్యుత్ రాజ్, కరస్పాండెంట్ కాసల భాను ప్రసాద్, ప్రిన్సిపల్ టివి.రాజశేఖర్, ప్రధానోపాధ్యాయులు జివిస్ నరసింహులు, ఇన్‌ఛార్జి రవీంద్రబాబు, రాధా, సురేష్, కృష్ణ, వాసుదేవరాజు, సరళమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

కంది,జొన్న,శనగ పంటల్లో నీరు నిల్వలేకుండా మురుగు కాలువలు ఏర్పాటు చేసుకోవాలని ఎఒ వెంకటకృష్ణారెడ్డి సూచించారు. బొందలకుంట గ్రామంలో కంది, జొన్న పంటలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ కంది, జొన్న, శనగ పంటల్లో రసం పీల్చే పురుగు ఉధృతి నివారణకు సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాని సూచించారు. వర్షాభావ ప్రభావం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. నివారణకు ఎకరాకు 8 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను అడుగు ఎత్తులో కర్రలకు అమర్చుకోవాలన్నారు. వేప నూనె 5ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను ఈనెల 25లోపు పంట నమోదు చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమాజసేవలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరులోని రాణి తిరుమల దేవి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్పెషల్ క్యాంపులో భాగంగా 6వరోజు మంగళ వారం తాళ్లమాపురం గ్రామంలో సమాజసేవ చేశారు. ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. సచివాలయ ఇన్‌ఛార్జి సెక్రెటరీ విజయరాజు భాగస్వామ్యంతో ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ ప్రతివీధి తిరుగుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, సచివాలయ డంపింగ్‌కు అందించారు. మధ్యాహ్న కార్యక్రమంలో భాగంగా జిఎస్‌టిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్ జిఎస్‌టి సూపర్ సేవింగ్స్ అంశానికి సంబంధించి కళాశాల జిఎస్‌టి అధ్యాపకులు హుస్సేన్ స్థానిక పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం పలు విషయాలను వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్, అధ్యాపకులు, స్కూల్ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటి క్యాంపస్ ఎన్ఎస్ఎస్ యూనిట్ 11, 13,14,15 ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాలు నిర్వ హించినట్లు డైరెక్టర్ ఏవీఎస్ కుమా౦స్వామి గుప్తా పేర్కొ న్నారు. ఏడురోజుల పాటు కుమ్మరాం పల్లె, తాళ్లపల్లె, కొండవాండ్లపల్లె, కుమార కాల్వ గ్రామాల్లో స్వచ్ఛ భారత్, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 200 మంది విద్యా ర్థులు ఉత్సా హంగా ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, గ్రామ పురవీధుల్లో చెత్త చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. గ్రామ ప్రజల్లో పరిశు భ్రతపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అవగాహన కల్పించారు. యూనిట్ 13 ప్రోగ్రాం ఆఫీసర్ అమరేంద్ర కుమార్ సూచనల మేరకు కో-ఆర్డినేటర్స్ దీప్తి, ప్రసాద్ బృందం పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కో-ఆర్డినేటర్లు దీప్తి, తిరుపతిరెడ్డి, గోవర్ధన్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి స్వామి వివేకానంద విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఎస్‌జిఎఫ్ జిల్లాస్థాయి క్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఎంపి కైనట్లు వేంపల్లెకు చెందిన స్వామి వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ రామాం జనేయరెడ్డి పేర్కొన్నారు. పులివెందులలో మంగళ వారం జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో వివేకానంద పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు తెలిపారు. మండలస్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో ప్రతిభ చాటడడంతో జిల్లాస్థాయికి ఆయా కేటగిరీల వారీగా ఎంపికయ్యారని తెలిపారు. ఖోఖో క్రీడల్లో సీనియర్స్ విభాగంలో ఎం.దేవేంద్రరెడ్డి, ఫైరోజ్, జయప్రసాద్ రెడ్డి, మహేష్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, లోహిత్ కుమార్‌రెడ్డి ఎంపికైనట్లు పేర్కొన్నారు. జూనియర్స్ విభాగంలో ప్రశాంత్ కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పవన్ కొండారెడ్డి, భరణి కుమార్‌రెడ్డి, జగదీష్ ఎంపికయ్యారని తెలిపారు. యోగా విభాగంలో ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారని తెలిపారు. కబడ్డి సీనియర్స్ జట్టుకు జగదీశ్వర్‌రెడ్డి, జూనియర్స్ జట్టుకు గోవర్ధన్‌రెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. చెస్ విభాగంలో రుద్రమూర్తి రెడ్డి ఎంపికయ్యారన్నారు. బాలుర విభాగంలో 15 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపిక కావడం పట్ల పిఇటి పద్మజను కరస్పాండెంట్ అభినందించారు.

'మాకు న్యాయం చేయండి'

ప్రజాశక్తి - కడప

బేడ బుడగ జంగం కులానికి చెందిన వారిని ఎస్‌సి జాబితాలో చేర్చి న్యాయం చేయాలని బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు పస్తం అంజి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక బేడ బుడగ జంగం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బేడ బుడగ జంగాల పిల్లల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని ఎస్‌సి జాబితాలో చేర్చాలని తెలిపారు. బుడగ జంగాల వృద్ధులకు, వితంతలకు, వికలాంగులకు పింఛను, ప్రభుత్వ పథకాలకు కుల ధృవీకరణ పత్రాలు లేక అవస్థలు పడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం బుడగ జంగం కులానికి సెల్ఫ్ సర్టిఫికెట్ ద్వారా పథకాలు అందించేదని, ప్రస్తుత ప్రభుతమూ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కె.లక్ష్మయ్య, పి. ఆంజనేయులు, .వెంకటయ్య పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన 'సింగం'

ప్రజాశక్తి - జమ్మలమడుగు : ఎస్‌పి నచికేత్ విశ్వనాథ్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో జమ్మలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివమోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్ కంట్రోల్లో పెట్టడానికి పోలీసులకు తమ సంపూర్ణ సహకారాలు అందిస్తామని ఎస్‌పికి తెలిపారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న బూత్ కమిటీ సభ్యులు

ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలం వైసిపి రూరల్ బూత్ కమిటీ అధ్యక్షుడిగా అలుగూరి సతీష్ కుమార్ రాయల్ ఇటీవల నియమితులయ్యారు. మంగళవారం వైసిపి నాయకులు, కార్యకర్తలతోపాటు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే సారథ్యంలో మండలంలో వైసిపి బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళా ్తమన్నారు. వైసిపి నాయకులపై అక్రమ కేసులు వేదిస్తున్నారని అయినా భయపడేది లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతా మన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన ప్రతిఫలం ఉంటుం దన్నారు. ఇప్పటి నుంచే పార్టీ పటిష్టతపై దృష్టి సారించి నియో జకవర్గంలో మరింత పటిష్టంగా తయారయ్యేందుకు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుక పోవాలని సూచించారు. 2029లో జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు.

క్రైం కార్నర్

ఆస్తి కోసం భార్యపై యాసిడ్ దాడి

- చికిత్స పొందుతూ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్


శశికల(ఫైల్ ఫొటో)

ఆస్తికోసం కట్టుకున్న భార్యను అంతమొందించాడు ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి. బాధ్యతాయుత పదవిలో కొనసాగి, రిటైర్డ్ అయ్యి జీవిత చరమాంకంలో ఆస్తి కోసం భార్యపై కక్ష్య పెంచుకొని తన తమ్ముడితో కలిసి భార్యపై యాసిడ్ దాడి చేసి అంత మొందించాడు. 15రోజుల పాటు మృతువుతో పోరాడిన ఆమె మంగళవారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం, శేషప్పతోటకు చెందిన రమణ బిఎస్‌ఎఫ్‌లో డిఎస్‌పిగా బాధ్యతలు నిర్వర్తించి రిటైర్డ్ అయ్యారు. ఇతనికి భార్య శశికల(52) కుమారుడు సృజన్, కుమార్తె సాత్వికవర్షణ ఉన్నారు. కుటుంబ కలహాల కారణంగా భార్యాభర్తలు కొంతకాలంగా విడివిడిగా ఉంటున్నారు. శశికళ ఇద్దరు పిల్లలతో కలిసి శేషప్పతోటలోని సొంత గృహంలో ఉండగా, రమణ తన స్వగ్రామమైన నిమ్మనపల్లి మండలం, నాగంవారిపల్లెకు వెళ్ళిపోయి, అక్కడే ఉంటున్నాడు. ఇంటిని తన పేరు రాయాలని భార్యను వేధింపులకు గురి చేస్తూ వస్తున్నాడు. అయితే ఈ ఇల్లు పిల్లలకే చెందుతుందని, నీ పేరు రాయనని శశికళ పట్టు బడుతూ వచ్చింది. ఈనెల 6న రమణ తమ్ముడు రాజన్నతో కలిసి శేషప్పతోటలో ఉన్న భార్య ఇంటికి వచ్చాడు. భార్య పూజలు చేసుకుంటుండగా వెళ్లి ఆమెను బలవంతంగా పట్టుకొని, నోటిలో యాసిడ్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అడ్డుకొని బాధితురాలని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలం, తెట్టు పంచాయతీ, చింతయ్యగారికోటకు చెందిన రవి కుమారుడుతేజ(19), రాధాకృష్ణ కుమారుడు జగదీష్ (21) ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్డులో ఉన్న కనుమలో గంగమ్మగుడికి బయలుదేరారు. ఇదే సమయంలో మదనపల్లె మండలం, వేంపల్లి దళితవాడకు చెందిన సంతోష్, ప్రేమ్ కుమార్ ద్విచక్ర వాహనంలో పుంగనూరు రోడ్డు నుంచి మదనపల్లె వైపు వెళ్తుండగా రెండు ద్విచక్ర వాహనాలు స్థానిక బైపాస్ రోడ్డులో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమా దంలో తేజ అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయ పడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను 108లో ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. పరీక్షించిన వైద్యులు బాధితులకు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన మహిళ మంగళవారం మృతి చెందింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, చీకల బైలు పంచాయతీ, రాగిమాకులపల్లి చెందిన శారదమ్మ (42), విశ్వనాథరెడ్డి దంపతులు కుటుంబ సమస్యలపై గొడవపడ్డారు. తీవ్ర మనస్థాపానికి గురైన శారదమ్మ మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు, బస్సు ఢీ

- నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లకు గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కారు, ఆర్టీసి బస్సు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం పెద్దమండ్యం మండలం లో జరిగింది. ఎస్ఐ కథనం మేరకు.. గాలివీడు మండలం, ప్యారంపల్లికి చెందిన జగదీష్, సాయి చరణ్, గాలివీడుకు చెందిన పుల్లారెడ్డి, స్రవంతి బెంగుళూరు లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. దీపావళి పండుగకు స్వగ్రామాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో గడిపారు. తిరిగి విధులకు వెళ్లేందుకు గాలివీడు నుంచి వేకువ జామునే కారులో బెంగుళూరుకు బయలు దేరారు. మార్గ మధ్యంలోని పెద్దమండ్యం మండలం, కలిచర్ల వద్ద ఎదురుగా ఆర్టీసీ బస్సు రావడంతో ఎదు రెదురుగా కారు, బస్సు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు కారులో ఇరుక్కుపోయారు. బస్సులో మదనపల్లి నుండి లక్కిరెడ్డిపల్లికి విధులకు వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ ఉండడంతో ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి స్థానికుల సాయంతో గడ్డపారలు ఉపయోగించి కారులోని బాధితులను బయటకు లాగి 108లో చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డ బాధితులకు జిల్లా ఆస్పత్రిలో మెరుగైన చికిత్సలు అందించారు. గాయపడిన పుల్లారెడ్డి, జగదీశ్, స్రవంతి, సాయి చరణ్ పరిస్థితి విషమంగా ఉండడంతో డాక్టర్లు తిరుపతికి రిఫర్ చేశారు. పెద్దమండ్యం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్రమాదంలో గాయపడిన పుల్లారెడ్డి, జగదీశ్,, సాయి చరణ్, స్రవంతి